ప్రజాశక్తి

మంగళవారం 16 డిసెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

పాలన పరుగులు పెడుతుందా?

- కొత్త కలెక్టర్.. ఎస్పీలు వచ్చాక ఇప్పుడిప్పుడే ఊపు
- నిధులతో ముడిపడి ఉన్న పనులపైనే తర్జన భర్జనలు
- కొత్త జిల్లాల ప్రకటనతో సంబరాల్లో పాలకపక్ష నేతలు
- భూసేకరణలు, రెవెన్యూ అంశాలపై పెరిగిన శ్రద్ధ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తొలి ఏడాది ముగిశాక పాలనలో వేగం లేదని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాలనా యంత్రాంగంలోని కీలకమైన అధికారులను మార్పులు చేసింది. కలెక్టర్, ఎస్పీ ఇద్దరినీ బదిలీచేసి కొత్తవారిని నియమించారు. ఈ తరుణంలో పాలనలో వేగం పెరిగిందా? ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఇస్తున్నారా? ప్రజా ప్రతినిధుల సిఫార్సులకు తగ్గట్లుగా పనులు జరుగుతున్నాయా? అనే అంశాలపై ఇపుడు చర్చ సాగుతోంది. వాస్తవానికి కొత్త అధికారులు వచ్చాక కొంత ఊపు కనిపిస్తోంది. బదిలీల సమయంలోనే కొత్త అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఏయే అంశాల్లో వెనుకబాటు వల్ల ఇబ్బందులు వచ్చాయో వాటిని కలెక్టర్, ఎస్పీలకు వివరించి తగు జాగత్తలు తీసుకుని ముందుకు సాగాలని పోస్టింగుల సమంలోనే దిశానిర్దేశం చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగానే ముందుకు సాగాలని కలెక్టర్ ఎస్పీలున్నారు. కొత్తగా అధికారులు వచ్చాక డిఆర్సీ కూడా జరిగింది. జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశాలు, ఎట్రాసిటీ కమిటీ సమావేశం వంటివి జరిగాయి. వీటిల్లో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. వాటికి పరిష్కారాలు వెతికే పనుల్లో యంత్రాంగం ఉంది. భూసేకరణలపై దృష్టి సారించారు. రెవెన్యూ అంశాలు ఎక్కడైతే పెండింగులో ఉన్నాయో వాటికి పరిష్కారాలు చూస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో స్వీకరించే అర్జీలకు పరిష్కారాలు చూపే యత్నం జరుగుతోంది. కొత్త అధికారులు వచ్చాక వెంటనే జరిగిన పెద్ద నిర్ణయం ఏమిటంటే జిల్లాల విభజన. ఈ ప్రక్రియతో జిల్లాలో కొత్త ఊపు వచ్చింది. మార్కాపురం జిల్లా ప్రకటన కీలక అంశం. అద్దంకి, కందుకూరు నియోజక వర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం కూడా మరో కీలక పరిణామం. ఆయా నియోజక వర్గాల్లో సంబరాలు చేపట్టారు. మార్కాపురం ప్రతిపాదిత మార్కాపురం జిల్లాలోనూ కొత్త పరిణామంగా భావిస్తున్నారు. అయితే దర్శి లేదనే చర్చ రాజకీయంగా ముందుకు వచ్చింది. వైసిపి నేతలు దీనిపై స్పష్టతలేని వైఖరితో ఉన్నారు. దర్శిని కలపాలని కోరుతున్నారు. అయితే మెజార్టీ మండలాల ప్రజానీకం ప్రకాశంలోనే ఉండాలని కోరుతున్నారు.

▶ 3లో

విద్య, వైద్యం ప్రైవేటుపరం కానీయం

- మెడికల్ కాలేజీలు దక్కేవరకు ఉద్యమం ఆగదు
- వైఎస్ సంపద సృష్టిస్తే చంద్రబాబు దోచేస్తున్నాడు
- ప్రజల ఆస్తులు కాపాడుకునేందుకు ప్రజా పోరాటం
- కోటి సంతకాల ఉద్యమంలో వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజల కోసం వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం కానివ్వబోమని, వాటిని దక్కించుకునేందుకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని వైసిపి నేతలు ప్రకటించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ పార్టీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా సోమవారం ఒంగోలు చర్చి సెంటర్ వద్ద పెద్దఎత్తున ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వైసిపి శ్రేణులు వేలాదిగా పోటెత్తారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి నాయకత్వంలో ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన ఆ పార్టీ శాసన సభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్టీ కార్యదర్శుల సారథ్యంలో వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు 11గంటలకల్లా చర్చి సెంటర్‌కు తరలివచ్చారు. 12గంటలకు చర్చి సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యకర్తలను ఉద్దేశించి పలువురు నాయకులు మాట్లాడారు.

ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ఏక కాలంలో తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో మంజూరు చేయించి, శంకుస్థాపన చేసిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం 10 కాలేజీలు

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

కూటమి ప్రభుత్వం పిపిపి పేరున తన అనుయాయులకు కట్టబెట్టే యత్నం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. పేద ప్రజల సంక్షేమం కోసం విద్య, వైద్యం అందుబాటులో ఉంచేందుకు మొదట వైఎస్ రాజశేఖరరెడ్డి, అనంతరం ఆయన వారసుడు వైఎస్ జగన్ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 18నెలల కాలంలో పేద ప్రజల ప్రాథమిక హక్కుగా ఉన్న విద్య, వైద్యం ప్రైవేట్‌పరం చేయాలనే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. దేశంలో ఎక్కడా 99 పైసలు చలామణి కాకున్నా చంద్రబాబు ఎకరా భూమి 99 పైసలుకే తనవారికి పప్పు బెల్లాలుగా అమ్మేస్తున్నట్లు ధ్వజమెత్తారు.

▶ 2లో

దూబగుంట్లలోనే ట్రిపుల్ ఐటీ

ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ హనీఫ్ డిమాండ్

ప్రజాశక్తి-పామూరు

దూబగుంట్ల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేసిన స్థలంలోనే తిరిగి ట్రిపుల్ ఐటీ కాలేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ హనీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య భవనం సెంటర్లో చంద్రబాబు నాయుడుకు బహిరంగ లేఖ, సంతకాల సేకరణ కార్యక్రమం యుటిఎఫ్ నాయకులు, విశ్రాంతి ఉద్యోగులు గల్లా చెన్నయ్య, శ్రీనివాసరాజు సంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2018లో పామూరు మండలం దూబగుంట్ల గ్రామంలో త్రిబుల్ ఐటీ కాలేజీకి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు హయాంలో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారన్నారు. కదిరి బాబురావు నిర్లక్ష్యం కారణంగా కాలేజీ ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. ప్రభుత్వం మారిపోవటంతో వైసీపీ అధికారంలోకి వచ్చిందని, అప్పుడు ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ కనిగిరి మండలం బల్లిపల్లి గ్రామంలో నిర్మించేందుకు ప్రయత్నాలు చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న ముక్కు ఉగ్ర

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

నరసింహారెడ్డి బల్లెపల్లిలో కాలేజీ పెట్టేది లేదని చంద్రబాబు నాయుడు భూమి పూజ చేసిన ప్రాంతంలోని కాలేజీ నిర్మించాలని పామూరు నుంచి దూబగుంట్ల వరకు పాదయాత్ర చేసి సెల్ఫీ ఫొటోలతో పేపర్ ప్రకటన చేసుకున్న విషయం మర్చిపోయారని హనీఫ్ ఆరోపించారు. తిరిగి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పట్టుదలతో తిరిగి దూబగుంట్ల గ్రామంలో కాలేజీ నిర్మాణం చేపట్టాల్సింది పోయి వైసీపీ ప్రకటించిన ప్రాంతంలో అక్కడే నిర్మాణం చేపడతామని ప్రచారం చేసుకోవడం పామూరు మండల ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. దూబగుంట్లలో కాలేజీ రాకపోతే రాజకీయానికి దూరంగా ఉంటానని సవాలు విసిరిన మాటలు గుర్తు లేదా అని ప్రశ్నించారు. కనిగిరి శాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోవాలని అన్నారు. మంగళవారం నుంచి ప్రతి గ్రామంలో సంతకాలు సేకరించి

▶ 2లో

పొట్టి శ్రీరాములుకు మంత్రి స్వామి నివాళి

అమరజీవి ప్రాణత్యాగంతో రాష్ట్ర అవతరణ: మంత్రి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగా తెలుగు రాష్ట్రం అవతరించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. సోమవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక సీవిఎన్ రీడింగ్ రూమ్ ఎదురుగా ఉన్న అమరజీవి విగ్రహానికి ఆయనతో పాటు కలెక్టర్ పి రాజాబాబు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు భాష మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని 58రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారన్నారు. కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ

▶ 2లో

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

రహదారి నిర్మాణానికి మంత్రి సత్యప్రసాద్, పార్థసారథి శంకుస్థాపన

ప్రజాశక్తి-రేపల్లె

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేస్తోందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. లంకెవానిదెబ్బ గ్రామంలో రూ.21 లక్షలతో నూతనంగా నిర్మించిన యానాదుల కమ్యునిటీ హాలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సామాజికంగా అత్యంత పేదరికంలో ఉన్న యానాదుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు తమ పాలనలో వెనుకబడిన సామాజిక వర్గమైన యానాదుల సంక్షేమానికి కృషి చేశామన్నారు. విఆర్ఓ సంస్థ ద్వారా 700 పైగా ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాల అభివృద్ధికి పేదల సంక్షేమానికి ఏ మాత్రం కృషి చేయలేదని అన్నారు. నాటి పాలకులకు కూల్చటం తప్ప, నిర్మించడం చేతకాదని విమర్శించారు. పేదలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ పునర్నిర్మాణ సంస్థ, ప్రభుత్వ ఆర్థిక

శంకుస్థాపన చేస్తున్న మంత్రులు సత్యపసాద్, పార్థసారథి

సహకారంతో లంకెవానిదెబ్బ గ్రామంలోని 39 మంది యానాది కుటుంబాలకు ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను రాజకీయ క్రీడకు ఉపయోగించుకుందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ పంతాన్ని మురళీధరరావు, కమతం సాంబ శివరావు, కమతం విజయకుమారి, లంకెవానిదెబ్బ సర్పంచి చిలకలపూడి పాపారావు, గడ్డిపాటి రవి, గడ్డిపాటి రజినికుమారి, తలసిల శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపిపి కోపనాతి రాజశేఖర్, గంగాధరరావు, ఓలేటి గంగాధరరావు, ఆర్‌డీవో రామలక్ష్మి, తహశీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ప్రైవేటుపరం కానీయం

(మొదటిపేజీ తరువాయి)

ఎట్టి పరిస్థితుల్లోనూ మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం కానివ్వమని, ప్రజల ఆస్తులు, హక్కులు కాపాడుకునేందుకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమ జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేరేందుకు ప్రజల కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విధ్వంసానికి తెగబడుతోందని దుయ్యబట్టారు. మెడికల్ కాలేజీ దక్కించుకునేందుకు తమ పార్టీతో పాటు అన్ని రాజకీయ పార్టీలు కోటి సంతకాల ఉద్యమంలో భాగస్వాములయినట్లు ఆయన పేర్కొన్నారు.

మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ తనకు తాను చరిత్ర కలిగిన ముఖ్యమంత్రిగా ప్రకటించుకునే చంద్రబాబు తన చరిత్రలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ సాధించిన చరిత్ర లేదని తీవ్ర విమర్శలు చేశారు. కాలేజీలు సాధించక పోగా తాము సాధించిన కాలేజీలు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం తగదన్నారు. ప్రభుత్వం పున: సమీక్షించి ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం వైద్య విద్య ఆరోగ్యశ్రీ పేరుతో ఉచిత వైద్యంతో పాటు అమ్మ ఒడి, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగా పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలో ప్రజల తిరస్కరణకు గురైన చంద్రబాబును ప్రజలు ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు.

యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దేశ చరిత్రలోనే కోటి సంతకాలతో చేపట్టిన ఉద్యమంగా పేర్కొన్నారు. వైద్యం, వైద్య విద్య ప్రభుత్వ రంగంలో ఉండాలని దేశంలో తొలిసారి చేపట్టిన కోటి సంతకాల ఉద్యమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు.

మాజీ శాసనసభ్యులు, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కో కాలేజీ రూ.400 కోట్లు నుంచి రూ.500 కోట్లు నిర్మాణం, రూ.100 కోట్లు నుంచి రూ.600 కోట్లు విలువైన స్థలాలతో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి సంపదను సృష్టిస్తే చంద్రబాబు సంపదను తన వారికి పంచేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల సంపదను దోచిపెట్టే హక్కు చంద్రబాబుకు ఎవరిచ్చారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఉచిత వైద్య హక్కును కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమం చేద్దామని ఆయన ప్రకటించారు. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రాహ్మానందరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు స్పందించారన్నారు. జిల్లాలో 5,26,144 మంది సంతకాలు చేయడం వెనుక ప్రైవేట్ మెడికల్ విద్యపై వ్యతిరేకత స్పష్టమవుతోందని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వరరావు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ మాట్లాడారు. తొలుత నేతలు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో కోటి సంతకాల సేకరణ పత్రాలు తాడేపల్లికి తరలింపు కార్యక్రమానికి జెండా ఊపి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చర్చి సెంటర్, ప్రకాశం భవన్, నెల్లూరు బస్‌స్టాండ్, మినీ స్టేడియం మీదుగా వైసిపి జిల్లా కార్యాలయానికి, అక్కడ నుంచి తాడేపల్లి గవర్నర్ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్లు డాక్టర్ మాదాసి వెంకయ్య, వైఎం ప్రసాదరెడ్డి, రాష్ట్ర నాయకులు కొమ్మూరి కనకారావు, డాక్టర్ బి అశోక్ కుమార్, పాలడుగు రాజీవ్, కెవి రమణారెడ్డి, కుప్పం ప్రసాద్, ఒంగోలు పార్లమెంట్ రాష్ట్ర సెక్రటరీ బొట్ల రామారావు, ఇసిఇ సభ్యులు చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షులు కఠారి శంకర్, కె నరసింహగౌడ్, ఎన్ శ్రీనివాసరావు, వై గౌతమ్, దుంపా చెంచిరెడ్డి, గాయం సావిత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దూబగుంట్లలోనే ట్రిపుల్ ఐటీ

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, షేక్ ఖాదర్ బాషా, కే మాల్యాద్రి, యాట వీరనారాయణ, సిహెచ్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పిచ్చిరెడ్డి, కే శంకర్, విద్యార్థులు, మండల ప్రజలు, ఐద్వా నాయకులు సయ్యద్ షమీ, కె ధనలక్ష్మి, సయ్యద్ రమీజా, పలువురు సంతకాల శాఖలో పాల్గొన్నారు.

అమరజీవి త్యాగంతో రాష్ట్ర అవతరణ: మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

అమరజీవి పొట్టి శ్రీరాములు పట్టుదల దేశవ్యాప్తంగా వ్యాపించే విధంగా తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మణనాయక్, స్టెప్ సీఈఓ శ్రీమన్నారాయణ, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పిన్నిక మధుసూదనరావు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

IA నోటీసు

మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA No : 474/2016
in
OS No : 38/1985
(SCj కోర్టు చీరాల)

Between:-
వలేటి మాణిక్యమ్మ (died) వగైరాలు... పిటీషనర్స్
మరియు
వలేటి శివప్రసాద్ వగైరాలు .... రెస్పాండెంట్స్

To
R13) తల్లపనేని రాంబాబు S/o సీతారామయ్య, జనకవరం, J.పంగులూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నంబరు గల పిటీషను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.19-12-2025న ఉ10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరయి మీఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమునందు పిటీషను నిచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి అనుమతితో //
వాయిదా తేది : 19-12-2025

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీ రమణి
న్యాయవాదులు, పర్చూరు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 426/2025

షేక్ మునవర్ భాష .. వాది
వర్సస్
షేక్ జలీల్ చనిపోతే అతని వారసులు షేక్ అజ్మత్ .. ప్రతివాది

టు,
<u>ప్రతివాది చిరునామా</u>
షేక్ అజ్మత్ భర్త లేట్ జలీల్, వయస్సు 35 సం.లు, కొమరోలు గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది దావా పరిహార నిమిత్తము దావా దాఖలు చేసి మీకు దావా సమన్లు అనేక పర్యాయములు పంపగా తిరస్కరించు చున్నందున పేపరు ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ అగుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. మీ సమన్లు నిమిత్తం వాయిదా 29-12-2025వ తేదీన యుండి యున్నది. సదరు తేదీన ఉదయం 10:30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీపరోక్షమున తీర్మానించేదరని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
తేదీ : 14-12-2025

ఇట్లు
శ్రీమతి కాల్వ సత్య సులోచన,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9490040889

సబ్ స్టిట్యూటెడ్ సర్వీసు నోటీసు
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు చీరాల

ఓ.ఎస్ నెం.90/2010

బిట్వీన్ :-
పోలు దాసు కోటేశ్వరమ్మ ......వాది
V/s
1.కొప్పోలు వెంకటేశ్వరరావు (డైడ్) అండ్ అదర్స్ .... ప్రతివాదులు

టు:
కొప్పోలు రవళి,
D/o లేటు కొప్పోలు చెన్నకేశ్వర్లు,
అలియాస్ చెన్నయ్య ,
డోర్ నెంబర్01-112, గీతా మందిర్ రోడ్డు,
వెంకటప్పయ్య కాంప్లెక్స్ ,ఫస్ట్ ఫ్లోర్,
అద్దంకి -523201, ప్రకాశం జిల్లా.

పైనంబరు OS.No : 19/2010 కేసులో మిమ్ములను పార్టీగా చేర్చమని వాది పోలుదాసు కోటేశ్వరమ్మ గారు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. మీకు సదరు పిటిషన్ లో IA No : 630/25 నోటీసులు జారీ చేయగా మీరు తీసుకొనక ఉన్నందున శ్రీకోర్టు వారు సబ్ స్టిట్యూ టెడ్ సర్వీసు ద్వారా నోటీసులు జారీ చేసినందున మీరు ది.17- 12- 2025న ఉదయం 10:30 ని.ల కు పై కోర్టులో స్వయంగా కాని, న్యాయవాది ద్వారా కానీ హాజరయి మీకు ఆక్షేపణలు ఉన్నయెడల వ్రాతపూర్వకముగా తెలియజేసుకొ నవలసినదిగా ఇందు కోరడమైనది . లేనియెడల మీపరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది .

ఇట్లు
M.V CHALAPATHI RAO, Advocate
Paparajuthota
CHIRALA-523155 (A.P.)
Ph: 9985854833

నోటీసు
మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

F.D.P.NO: 1/2021
IN
O.S.NO: 80/2001

BETWEEN:
పెనుగొండ హరి ప్రసాదరావు [DIED] & వగైరాలు ... పిటీషనర్లు
V/s
పెనుగొండ ముత్యాలు & వగైరాలు ..రెస్పాండెంట్స్

To
<u>9వ రెస్పాండెంటు :</u> మోటుమర్రి వాణి, W/o. వెంకట రావు చనిపోయినందున వారి వారసులకు

పై కోర్టులో, పిటీషనర్లు భాగ పంపిణీ కొరకు పై నంబరు పిటిషన్ దాఖలు చేయగా సదరు పిటిషన్ లోని 9వ రెస్పాండెంటు అయిన మోటుమర్రి వాణి, W/O. వెంకట రావు ఇంటేస్టేట్‌గా మరణించినట్లుగా తెలిసినందున వారికి సంబంధించిన వారసులకు కోర్టు ద్వారా సమనులు పంపుటకు వారు వేరే వేరే ప్రాంతములలో వున్నట్లుగాను మరియు వారి అడ్రెస్లు తెలియనందున వారికి సంబంధించిన వారసులు యెవరైనా వున్న యడల 27-01-2026 తేదీన ఉదయం 10-30 గంటలకు శ్రీ కోర్టు వారి యెదుట స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై ఏవైనా ఆక్షేపణలు వున్నయడల తెలుపుకొనుటకు ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియ చేయటమైనది. లేనియడల పరోక్షముగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
వాయిదా తేదీ : 27-01-2026.
తేది: 15-12-2025.

పన్నెం మల్లిఖార్జున బాబు,
సజ్జా శ్రీనివాస రావు,
పిటీషనర్లు తరపు న్యాయవాదులు,
చీరాల,బాపట్ల జిల్లా.
(PMB Cell No: 8333052055)

ORDER 22 RULE 4 CPC NOTICE

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. No : 1205/2025
in
O.S. No : 83/2006

కర్రెద్దుల వెంకట సుబ్బారెడ్డి వగైరాలు .....పిటిషనర్లు /వాదులు
వర్సస్
దాసరి బర్నాబసు వగైరాలు ....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To
<u>17 నుండి 20 రెస్పాండెంట్లు / ప్రతిపాదిత</u>
<u>17 నుండి 20 ప్రతివాదులు:</u>
17) దాసరి శ్రావణ్ కుమార్ వురఫ్ అబ్రహాము, తండ్రి లేట్ బర్నాబసు, 32 సం.లు, జిరాయితి,
18) దాసరి సామేలు పురఫ్ ప్రవీణ్ కుమార్, తండ్రి లేట్ బర్నాబసు, 30సం.లు, జిరాయితి,
19) దాసరి నాని తండ్రి లేట్ బర్నాబసు, 28 సం.లు, జిరాయితీ, అందరు హరిజన, క్రిష్ణంశెట్టిపల్లె గ్రామము, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.
20) గాలి అరుణ భర్త లక్ష్మయ్య, తండ్రి లేట్ దాసరి బర్నాబసు, 26 సం.లు, హరిజన, గృహిణి, మహదేవపురం గ్రామం, శిరివెళ్ళ మండలం, నంద్యాల జిల్లా,

లేట్ దాసరి బర్నాబసు గారికి మిమ్ములను వారసులుగా గుర్తించ కోరుతూ పిటిషనర్లు/వాదులు పై నెంబరు పిటిషన్ ను దాఖలు చేసినందున, సదరు పిటిషన్ లో మీకేమైన ఆక్షేపణలు వున్న యెడల మీరు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేది 19-12-2025 న ఉదయం గం. 10:30 ని.లకు స్వయంగా గాని, లేదా మీ వకీలుగారి ద్వారా గానిహాజరై, మీఆక్షేపణలు తెలుపు కొనవలయును. లేనిచో మీపరోక్షమందు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడ మైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
స్థలం : గిద్దలూరు
తేదీ :15-12-2025

ఇట్లు
శ్రీ యస్.వి.నాగేంద్రబాబు,
పిటిషనర్లు /వాదులపరం అడ్వకేట్,
గిద్దలూరు.

దావాసమన్లు
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

ఓ.యస్.నెం.695/2021

బిట్వీన్:
అంబటి శ్రీదేవి ....వాది
మరియు
విష్ణుమొలకల వెంకట సుబ్బా రావు వగైరాలు ... ప్రతివాదులు

టు,
దండే బాలా సుబ్రమణ్యం, తండ్రి.సాంబ శివ రావు , నివాసం డోర్ నెం.7-24,పెరవలి గ్రామం,వేమూరు మండలం గుంటూరు జిల్లా, ప్రస్తుతం బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాని వాది పార్టీషను కొరకు దాఖలు చేయగా సదరు దావాలో 3వప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.26-12-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది.26-12-2025

శిఖా వంశీ కృష్ణ,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE KANDUKUR
O.S No:137/2016

Kallu chinnpareddy And Others ...Plaintiffs
V/s
Kallu Chirra Reddy And Others ... Defendants

To,
D18. Veluri Vijaya Sree, D/o. Late Tirupathi Reddy, R/o Bathulavani Street, Kothapet, Near post office, Kanigiri Town & Mandal, Prakasam. DT, AP.

పై నెంబరున వాదులు మీ మీద దావా పరిహారములకు డిక్రీ కోరుతూ దావా దాఖలు చేసినందుకు మీకు దావా సమన్లు మీ నోటీసు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది. 23-12-2025 కు వాయిదా వేసి ఉన్నారు. సదరు వాయిదా తేదీన 10:30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం
వాయిదా ది.23-12-2025

ఇట్లు
వై.సాంబశివరావు, M.com BL,
వాది తరపు న్యాయవాది,
కందుకూరు,
ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 376/2024

Between:
కోటి శివ ...వాది
Vs
మండూరి సుముద్రాని & మరియొకరు ...ప్రతివాదులు

To:
D1. మండూరి సుముద్రాని, భర్త హరిసత్యనారాయణ, గృహిణి, R/o. క్వార్టర్ నంబర్. 3, రేల్వే ఆఫీసర్స్ కాలనీ, DRM ఆఫీస్ కాంపౌండ్, గుంటూరు పట్టణము మరియు జిల్లా, గుంటూరు DMC.
D2. గండి చంద్రకుమారి, భర్త వీరయ్య, R/o. డోర్ నెంబరు 10-7-18, కరణం గారి వీధి, పేరాల గ్రామం, చీరాల మండలం, బాపట్ల జిల్లా, చీరాల DMC.

పై నెంబరు దావాలోని ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు వారు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పత్రికా ప్రకటన ద్వారా సమన్లు జారీ చేయడమైనది.
మీరు ది. 24.12.2025 తేదీన ఉదయం గం. 10.30 ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలను తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షనమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

- ❖ కోర్టువారి అనుమతితో....
- ❖ వాయిదా తేది: 24.12.2025

సం/- పి. సుధాకర రావు,
న్యాయవాది, చీరాల
ఫోన్ నెంబరు: 9440873409

పొగాకు కూలీల రక్షణ చట్టం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-చీమకుర్తి

పొగాకు ముఠా కూలీల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం రక్షణ చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక పంగులూరి కష్ణయ్య భవనం వద్ద పచ్చాకు ముఠా మేస్త్రీలు, కూలీలు, టోకర్ల సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో 200 మిలియన్ కిలోల పొగాకు పంట పండుతుందనానరు. ప్రకాశం జిల్లాలో 165 మిలియన్ కిలోల పొగాకు పండుతుందన్నారు. దేశంలోనే పొగాకు ఉత్పత్తిలో ప్రకాశం జిల్లా ముందుందన్నారు. పొగాకు ఎగుమతి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గత ఏడాది రూ. 16,786 కోట్లు విదేశీ మార్గక ద్రవ్యం లభించినట్లు తెలిపారు. పొగాకు పంటను ఆసరా చేసుకొని నాలుగున్నర కోట్ల మంది అనేక రకాల పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. వారి ద్వారా సుమారు లక్ష కోట్ల రూపాయలు ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఇంత ఆదాయం రావటానికి కారకులైన పొగాకు ముఠా కూలీలకు ఎలాంటి రక్షణ లేదని పేర్కొన్నారు. పని ప్రదేశంలో ఆకు కొట్టి ట్రాక్టర్ మీద వచ్చే సమయంలో ప్రమాదాలు జరిగి ప్రతి ఏడాది పదుల సంఖ్యలో కార్మికులు మత్యువాత పడుతున్నారన్నారు. ప్రమాదం లో కాళ్లు చేతులు విరగొట్టుకొని వికలాంగులై కుటుంబాలు జీవనోపాధి పోగొట్టు కొని జీవితాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీరి శ్రమను గుర్తించి ఒక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేసులు మాట్లాడుతూ జిల్లాలో 1,50,000 ఎకరాలలో పొగాకు పంట పండుతుందన్నారు. 70 వేల మంది పైగా కూలీలు నాలుగు నెలల పాటు పొగాకు పంటపై రకరకాల పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూలి రేట్లు విషయంలో ముందస్తు సరైన ఒప్పందాలు చేసుకోనందున పనులు పూర్తి అయిన తర్వాత రైతు, కూలీల మధ్య వివాదాలు వస్తున్నాయని తెలిపారు. అధికారులు బాధ్యత తీసుకొని ఇరువురి మధ్య పత్రాలు రాయించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు తొట్టెంపూడి రామారావు, వంజా చెన్నయ్య, వివిధ గ్రామాల చెందిన పచ్చాకు ముఠామేస్త్రీలు కందుల వెంకట్రావు, మెండ అంజయ్య, కావూరి లింకన్, బి ఇశ్రాయేలు, టి అశోక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

పాలన పరుగులు పెడుతుందా?

(మొదటిపేజీ తరువాయి)

ఏదేమైనా కొత్త జిల్లాల ప్రకటన కూడా పాలనపై ప్రభావం చూపింది. ఇక ఒంగోలు వద్ద ఎయిర్‌పోర్టుకు భూసేకరణ ప్రక్రియ వేగం చేశారు. అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. రెండో దశలో దీన్ని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణకు నిధులు కేటాయించేలా మంత్రులు దృష్టి సారించాల్సిఉంది. అదే విధంగా వెలుగొండ ప్రాజెక్టు పనలపైనా దృష్టి సారించారు. తుపాను వచ్చాక ఇప్పటికే మూడుసార్లు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. పనులపై శ్రద్ధ పెట్టారు. సొరంగాల్లో పనులను వేగం చేశారు. సప్లయి ఛానల్ గండ్లు పూడ్చివేత పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. ఏదేమైనా జూన్ నాటికి నీళ్లివ్వాలనే లక్ష్యం నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నాయి. నిర్వాసితుల్లో ఆరంభంలో ఉండే రెండు గ్రామాలను తరలించి నీటిని ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారు. వెలుగొండ పనులపై గతం కన్నా ఇప్పుడు వేగం పెంచారు. పర్యవేక్షణ కూడా పెరిగింది. ఇక మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి కూడా నియోజకవర్గాల్లో ఎక్కువ రోజులు తిరుగుతున్నారు. ఏదో కార్యక్రమాలు పెట్టుకుంటున్నారు. సమస్యలపై వచ్చే అర్జీలకు పరిష్కారం కోసం యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఒంగోలులోనూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రోడ్ల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనకు సిఎం చంద్రబాబు రావడం కూడా కొంత వేగం పెంచడానికి కారణమైంది. మొంథా తుఫాను సమయంలో యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మంచి సమన్వయంతో పనిచేశారనే గుర్తింపు వచ్చింది. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులకు నిధులు రాబట్టే పనుల్లో ఉన్నారు. ఇక ఈనెలాఖరులోనే కొత్త జిల్లాలకు గజిట్ వస్తుందని సమాచారం. జిల్లాల మార్పులు చేర్పులు జరిగాక పాలనలో మరింత వేగం పెరిగే అవశాలుంటాయని భావిస్తున్నారు. కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌లు క్రియాశీలకంగానే పనిచేస్తున్నారనే చర్చ నేతల్లో ఉంది.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -మద్దిపాడు

మద్దిపాడు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని స్కూల్ హెచ్ఎం మల్యాద్రి స్రోమవారం పత్యేకంగా అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11,12,13 తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించిన అండర్-17 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టు తరపున మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.అను పాల్గొని అత్యంత ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనటుల పాఠశాల పీడీలు కె.వనజ, బి.సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా అను ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. మల్యాద్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

విజయం సాధించిన శింగరాయకొండ ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు

శింగరాయకొండ క్రికెట్ జట్టు విజయం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఒంగోలులోని పివిఆర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం నిర్వహించారు. లీగ్ దశలో కీలకమైన మ్యాచ్‌లో శింగరాయకొండ మండల ఉపాధ్యాయుల జట్టు, టంగుటూరు మండల జట్టుపై విజయం సాధించింది. శింగరాయకొండ జట్టు క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో సమన్వయంతో ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఆధిపత్యం చెలాయించారు. జట్టు సభ్యుల క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ విజయంతో శింగరాయకొండ జట్టు తదుపరి దశకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నాయకులు, సహచర ఉపాధ్యాయులు జట్టు సభ్యులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్న ప్రభుత్వం : కదిరి

ప్రజాశక్తి- కనిగిరి

పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందకుండా చంద్రబాబు ప్రభుత్వం మోసం చేస్తున్నదని విశాఖ పట్నం పార్లమెంట్ పరిశీలకులు, కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు అన్నారు. విశాఖపట్నం జిల్లా కేంద్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు నాణ్యమైన విద్యా వైద్యం అందుకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేస్తూ అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో కెకె.రాజు, కన్నబాబు ,మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

మున్సిపల్ ఛైర్మన్ గఫార్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి పట్టణంలోని వెంకటేశ్వర దేవస్థానాన్ని గోవిందా స్వాములతో కలిసి కనిగిరి మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్ సందర్శి ంచారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో అష్టరోగ్య మూలతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర వ్యహించారు. అనంతరం గోవింద స్వాములు మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్‌ను శాలువాతో సత్కరించారు.

పూజలు నిర్వహిస్తున్న అబ్దుల్ గఫార్

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

గోవిందమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన మండవ గోవిందమ్మ దశదిన కర్మ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ పాల్గొని గోవిందమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ మార్నేని రాఘవ, ముప్పా రవి, మాజీ సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న,ఉన్నారు.

గృహాలు నిర్మించుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

అర్హులైన లబ్ధిదారులందరూ పక్కా గృహాలు నిర్మించుకోవాలని హౌసింగ్ ఇఇ కోటిరెడ్డి, ఎంపిడిఒ ప్రతాపరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వి.బైలు గ్రామంలో పిఎంఎవై పథకానికి అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించేందుకు హౌసింగ్ శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఈ సర్వేను అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శివ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1,08,057

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ.1,08,057 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా రూ.38,490, లడ్డూ ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.30,360, శాశ్వత అన్నదానానికి రూ.9127, పంచామతాభిషేకానికి రూ.27,580, ప్రసాదానికి విరాళంగా రూ.2,500 వచ్చినట్లు తెలిపారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-దర్శి : దర్శి పట్నంలోని కురిచేడు రోడ్డులోనున్న పిటిఎస్ కళ్యాణ మండపంలో ఈనెల 21న హమాలీవర్కర్స్ యూనియన్ మండల పథమ మహాసభ నిర్వహిస్తున్నట్లు కోటంచెట్టి హనుమంతరావు తెలిపారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను స్థానిక గుజ్జుల సరళా దేవి భవనంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ సంఘం నాయకులు బిజ్జాల శ్రీను, వెంకట్రావు శ్రీనివాసరావు, ఆవాల చిన్నబిక్షాలు, గుర్రపు శాల లింగయ్య, పి.చిన్నయేసయ్య, జి.చిన్నబాబు,ఆర్.కష్ణ తదితరులు పాల్గొన్నారు

రెండు గృహాల్లో చోరీ

ప్రజాశక్తి-శింగరాయకొండ : శింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని రెండు గృహాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెండి, బంగారం అభరణాలను అపహరించారు. బొడ్డు వినయ్ కుమార్ అనే వ్యక్తి విజయవాడలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి వచ్చి చూడగా ఇంటి తాళంపగలగొట్టి ఇంటిలోని 16 గ్రాముల బంగారం, కిలో వెండి వస్తువులను అపహరించారు. అదేవిధంగా విద్యానగర్ 5వ నెలలోని తలమంచి వెంకట కష్ణారెడ్డి నెల్లూరు జిల్లా కావలిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంటిలో బీరువాలో దాచిని నాలుగు సవర్ల గాజులు, మూడు సవర్ల దండ, 600 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. ఎస్‌సి బి. మహేంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

మాట్లాడుతున్న రైతు నాయకులు ఎన్ రంగారావు

ఆటలతో విద్యార్థుల అభివృద్ధి

రైతుసంఘం సీనియర్ నాయకులు నాగబోయిన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరంలో జరిగిన అనంతవరం వాలీబాల్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు సోమవారం అందజేశారు. రైతు సంఘం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడారు. విద్యార్థులు, యువకులు చదువులో ఇతర పనుల్లో ఉన్న ఆటలు ఆడాలని అన్నారు. ఆటల ద్వారా జీవితంలో అభివృద్ధి చెందవచ్చని, మంచి గుర్తింపు పొందవచ్చని అన్నారు. ఆటలు మానసిక ప్రశాంతతను, శారీరక దారుణ్యాన్ని, మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. ప్రభుత్వాలు పేద యువకులను గుర్తించి ఇష్టమైన ఆటల్లో నైపుణ్యం ఉన్న వారికి మంచి శిక్షణ ఇప్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో పేద విద్యార్థులే కనుక ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి అక్కడ చదువుతున్న విద్యార్థులు ఏ ఆటల్లో ప్రావీణ్యం ఉందో గుర్తించి శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఎస్‌సిఆర్‌పి సొసైటీ పర్చూరు నియోజవర్గ కన్వీనర్ రాము అధ్యక్షత వహించారు. పాఠశాల విద్యార్థినులు అక్షిత, సుచరిత, ప్రైజీ, న్యాన్సీ, అన్విత వందేమాతరం, మా తెలుగు తల్లి పాటలు ఆలపించారు. ఒపిడిఆర్ కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ బాషా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరంచేస్తూ యుకులు, విద్యార్థులకు అన్యాయం చేస్తుందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పేదవారికి అన్యాయం చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని విమర్శించారు. నూతన విద్యా విధానం తెచ్చి పేదలను చదువుకు దూరం చేసే విధంగా వ్యవహరిస్తుందని అన్నారు. అంబేద్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షుడు చిన నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించుకోవాలని చెప్పారు. ఓటు విలువ తెలుసుకుని సరైన వ్యక్తికి ఓటు వేయాలని అన్నారు. ఎడ్లపాడు కెఫ్‌సి యూత్ విన్నెర్స్, వేటపాలెం విటిఎం యూత్ రన్నర్స్, చిలకలూరిపేట జట్టు మూడో ప్రైజ్ విన్నర్స్ బహుమతి కింద రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి నగదు, షీల్డ్ మెడల్స్ బకరించారు. నిర్వహణ కమిటీ కన్వీనర్ అభి, అనంతవరం యువకులు అతిధులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమాలు సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, ప్రయదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు విజయమ్మ, ఎఐయస్ మండల కన్వీనర్ బాబు, యనమదల పాఠశాల హెచ్‌ఎం జి శ్రీనివాసరావు, యువకులు సాతులూరి ఉదయ్ భాస్కర్, పండు, భరత్, రాజేష్, రాజు, ప్రేమ్, మద్దిరాల రాజేశ్వరరావు, కోటయ్య, ఎం రాజ, జస్సిబాబు పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధి, సంక్షేమం 'కూటమి' లక్ష్యం

ప్రజాశక్తి - చీరాల, వేటపాలెం

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. వేటపాలెం మార్కెట్ సెంటర్‌లో షకీల్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకంతో పాటు నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎం మహేంద్రనాథ్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు దోగుపర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభల సందర్భంగా జెండావిష్కరణ

బాపట్లలో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న మజుందార్

భట్టిప్రోలులో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

అద్దంకిలో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బాపట్ల

సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా పాత బస్టాండు ఆటో స్టాండులో సిఐటియు పతాకాలను సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బి బుచ్చిరాజు, కర్రీ శ్రీను, ఆర్ రామకృష్ణ పాల్గొన్నారు.

చీరాలలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

చీరాల : సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఎన్ బాబురావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వై సింగయ్య, నాయకులు సామేలు, రాజు, చీమట వీరస్వామి, భవాని కుమారి, ఐఎల్‌టిడీ ఫెడరేషన్ నాయకులు పి కాలీషా పాల్గొన్నారు.

రేపల్లె : సిఐటీయూ అఖిల భారత మహాసభలు జయప్రదంకొరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల పనిప్రదేశాల్లో సిఐటియు జండాలా ఆవిష్కరణలో భాగంగా సీఐటీయూ జెండాలు ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఆటో స్టాండ్లు, రైస్ మిల్లులు కార్మికుల పని ప్రదేశాల్లో జండాల ఆవిష్కరించారు. బస్టాండ్, ఆటో స్టాండ్, పద్మాలయ, దుర్గ రైస్ మిల్ ముఠా వర్కర్స్ జెండా ఆవిష్కరణలో సిఐటియు జిల్లా కోశాధికారి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యు చిన్నబాబు, యు రామకృష్ణ ప్రసాద్, కార్యదర్శి వి సుబ్బారావు, కె మాణిక్యరావు, సిఐటియు నాయకులు జె ధర్మరాజు, కె రమేష్, యు వాసు, కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : సిఐటియు జండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి మనోజ్ కుమార్, అంగన్‌వాడి యూనియన్ నాయకులు గృహలక్ష్మి, రమణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు నిర్మల, రమాదేవి, సుజాత, మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు పాల్గొన్నారు.

కారంచేడులో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

కారంచేడు : సిఐటియు జెండా సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వై అనిత, సిఐటియు జిల్లా అధ్యక్షుడు మొలబంటి వసంతరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శిపి కొండయ్య, అంగన్‌వాడీ నాయకురాలు రాధా, ఆశా వర్కర్స్ నాయకురాలు నిర్మల, మేరీ, ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, పి ఏడుకొండలు పాల్గొన్నారు.

నిజాంపట్నం : సిఐటియు అఖిల భారత మహాసభలు ఈనెల 31నుండి జనవరి 4వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా సిఐటియు జెండా సోమవారం ఆవిష్కరించారు. సిఐటియు మండల నాయకులు పి సురేష్ బాబు మాట్లాడారు. మహాసభలు జయప్రదం చేసేందుకు కార్మికులు తరలి రావాలని కోరారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు రేపల్లె డివిజన్ నాయకులు కె గోపి, సిఐటియు నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అద్దంకి : సిఐటియు జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జండా ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. విశాఖపట్నంలో జరగనున్న మహాసభల్లో కార్మిక వర్గం లక్షలాదిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి ఆదాం, ఉసుపాటి శామ్యూల్, ఫ్రూట్ వెండర్స్ యూనియన్ నాయకులు తోటా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, జ్యోతి రాఘవయ్య, ఎస్‌కె మస్తాన్ పాల్గొన్నారు.

మార్టూరు : ఐక్య పోరాటం నినాదంతో దేశంలోని అన్ని సమస్యల పోరాటాల్లో సిఐటియు అగ్రభాగాన ఉంటుందని సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు తెలిపారు. డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్లో ముఠా యూనియన్ నాయకులు, రైతు సంఘం నాయకులతో కలిసి సిఐటియు జండా ఆవిష్కరించారు. మహాసభల నిర్వహణ కోసం నిధులు సేకరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి, ఎనికపాటి రాంబాబు, బోడెంపూడి సూరిబాబు, ఉప్పలపాటి వీర రాఘవరాజు, పేర్ని నాగేశ్వరరావు, నాగబోయిన సాంబశివరావు, దారా బాబురావు పాల్గొన్నారు.

రేపల్లెలో జెండడా ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపట్నంలో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

మార్టూరులో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

అధికార పార్టీ ప్రోత్సాహంతో బెల్ట్ షాపులు

సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కోటపాడులో ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా రాజకీయ నాయకులు, అధికారుల ప్రోత్సాహంతో బెల్ట్ షాపులు నడుపుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు విమర్శించారు. స్థానికంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సోమవారం మాట్లాడారు. కోటపాడులో వారం రోజుల క్రితం ఆ గ్రామ దళిత మహిళలు బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా గ్రామంలోని నాలుగు బెల్ట్ షాపులపై దాడి చేసి మద్యం సీసాలు బయటకు తీసుకొచ్చి దగ్ధం చేశారని, మరుసటి రోజు ఎక్సైజ్ అధికారులు వచ్చి తనిఖీ చేసి ఎక్కడ మద్యం సీసాలు దొరకలేదని, బెల్ట్ షాపులు నిర్వహించడం లేదని చెప్పారని అన్నారు. అప్పటి నుండి మళ్లీ ఆ బెల్ట్ షాపుల్లో మద్యం అమ్ముతున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో మద్యం విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని అన్నారు. ఎక్కడ ఆగలేదని చెప్పారు. ఆ గ్రామంలో మద్యం ఏరులై పారుతుందని అన్నారు. మద్యం వల్ల ఎన్నో పేద కుటుంబాలు బలవుతున్నాయని అన్నారు. ఈపాటికే ఆ దళిత కాలనీలో ఆరు కుటుంబాలు నిలువునా కూలిపోయా యని, భార్య, భర్తలు దూరమై కుటుంబాలు చిన్నా బిన్నం అయ్యాయని చెప్పారు. పిల్లలు తల్లిదండ్రులకు దూరమై చదువులకు దూరమై దిక్కు మొక్కు లేకుండా అయిపోయారని చెప్పారు. కేవలం సంపాదన తప్ప, పేదల గురించి పట్టించుకోకుండా బెల్ట్ షాపులు పెట్టి మద్యం విక్రయిస్తుంటే అధికారులు నిమ్మకు నీరె ఎత్తినట్లు చూస్తున్నారని అన్నారు. మద్యం వలన తమ జీవితాలు నాశనమై పోతున్నాయని దళిత కాలనీ మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులు మద్యానికే ఖర్చు పెడుతున్నట్లు చెప్పారని అన్నారు. బెల్ట్ షాపులు పెట్టి పేదల జీవితాలు సర్వనాశనం చేస్తున్నారని వాపో యారు. ఇప్పటికైనా అధికారులు బెల్ట్ షాపులను రద్దుచేసి, అక్రమ మద్యం విక్రయాలు అరికట్టాలని కోరారు. పేదల జీవితాల్లో చిచ్చు పెడుతున్న మద్యం విక్రయాలు గ్రామాల్లో నివారించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు, రాయిని వినోద్ బాబు, మల్లారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తలపనేని రామారావు

దళితుడు రెడ్డయ్య పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

రెడ్డయ్యపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలం వలివేరుకు చెందిన దళితుడు రెడ్డయ్యపై దాడి చేసిన కుర్రే అప్పిరెడ్డి, సందీప్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి కృష్ణ మోహన్, సిపిఎం వేమూరు కార్యదర్శి బి అగస్టీన్ డిమాండ్ చేశారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాల్లో చికిత్స పొందుతున్న రెడ్డియ్యను సోమవారం పరామర్శించారు. ప్రహరీ గోడకు ట్రాక్టర్ తగిలిందనే చిన్న కారణంగా అగ్రకుల అహంకారంతో కుర్రే అప్పిరెడ్డి అతని కొడుకు కలిసి దళిత సర్పంచ్ ఏసు కుమారుడు పందిపాటి రెడ్డియ్యపై దాడి చేసి కొట్టడం దుర్మార్గమైన చర్యని అన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడి చేసి 4రోజులైన దోషులను అరెస్ట్ చేయక పోవడం సరైనది కాదని అన్నారు. దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

తప్పిన భారీ ప్రమాదం

- అదుపుతప్పిన ట్రావెల్స్ బస్సు..
- డివైడర్‌ను ఢీకొట్టిన వైనం
- క్షేమంగా 40 మంది స్వాములు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

40 మంది భవానీ స్వాములు ప్రయాణిస్తున్న ట్రావెల్స్ బస్సుకు భారీ ప్రమాదం తప్పిన ఘటన సోమవారం ఉదయం పెద్దదోర్నాల-శ్రీశైలం ఘాట్ రోడ్డులో జరిగింది. దోర్నాల-శ్రీశైలం ఘాట్‌లోని పెద్ద మూలమలుపు వద్ద భవానీ స్వాములతో శ్రీశైలం వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి సైడ్ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా భవానీ స్వాములు భయందోళన చెందారు. డివైడర్‌పై నుండి ఏమాత్రం బస్సు కొంచెం ముందుకు వెళ్లినా బస్సు లోయలో పడి పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వీరంతా వైజాగ్ నుండి శ్రీశైలం వెళ్తుండగా దోర్నాల సమీపంలో బస్సు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోగా... బ్రేక్ ఫెయిలై ప్రమాదం జరిగినట్లు బస్సు డ్రైవర్ తెలిపారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు.

ముగ్గురు విద్యార్థులకు అస్వస్థత

- వైద్యం కోసం ఒకరు గుంటూరుకు..
- మరో ఇద్దరికి ప్రాథమిక చికిత్స

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలో ఏవివి హైస్కూల్లో ముగ్గురు విద్యార్థులు వేర్వేరు ఆరోగ్య కారణాలతో సోమవారం ఒక్కొక్క గంట వ్యవధిలో అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై సత్యవతి తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 9 గంటల సమయంలో పట్టణంలో డ్రైవర్స్ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థి పి పుష్ప రాజ్ ఛాతీ నొప్పితో తరగతి గదిలోనే పడిపోయాడు. వెంటనే ఆ విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గుండె సమస్య కారణంగా విద్యార్థిని

ఏవివి హైస్కూల్

108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఉదయం 11 గంటల సమయంలో సాంఘిక సంక్షేమ వసతిగృహం పదో తరగతి విద్యార్థి వి పావని ఊపిరి ఆడటం లేదని తరగతి గదిలోనే పడిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఈసీజీ తీశారు. ప్రాథమిక వైద్యం అందించి వైద్యులు విద్యార్థినిని పాఠశాలకు పంపారు. బాపట్ల మండలం జమ్ములపాలెంకు చెందిన పావనిని తల్లిదండ్రులు వచ్చి పావనిని ఇంటికి తీసుకెళ్లారు. ఉదయం 11 గంటలకు పట్టణంలోని డిఎంపల్లికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం సుభాష్ ఉపవాసం ఉన్న కారణంగా కళ్లు తిరిగి పడిపోయాడు. ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం అనంతరం అతడిని డిశ్చార్జి చేశారు. తల్లిదండ్రులను పిలిపించి ఆ విద్యార్థిని కూడా ఇంటికి పంపారు. అయితే మధ్యాహ్నం భోజనానికి ముందే విద్యార్థులు ఈ విధమైన అస్వస్థతకు గురయ్యారని ఆమె చెప్పారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్ నిరంజన్ పాఠశాలను పరిశీలించి విద్యార్థులను పరామర్శించి వెళ్లారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం తెలియజేసినట్లు హెచ్ఎం సత్యవతి చెప్పారు.

స్మశానాన్ని కబ్జా చేసింది ఉపాధ్యాయుడే.!

ఆందోళనకు దిగిన నాయుడుపల్లి కాలనీవాసులు

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడులోని దళితుల స్మశానాన్ని ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు కబ్జా చేసినట్లు రుజువైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. తర్లుపాడు-మార్కాపురం వెళ్లే రహదారి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 82/1లో య. 1.76 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని నాయుడుపల్లి కాలనీకి చెందిన వారు, దళితులు స్మశాన వాటికగా వినియోగించుకుంటున్నారు. గత 40 సంవత్సరాల క్రితం ఈ భూమిని ప్రజాప్రతినిధులు, పెద్ద మనుషులు, రెవెన్యూ అధికారులు నాయుడు పల్లె కాలనీవాసులకు స్మశాన వాటిక కోసం కేటాయించారు. అయితే గత వారం రోజుల క్రితం బండారు నాగరాజు అనే ఉపాధ్యాయుడు ఈ స్మశాన భూమిని ఆక్రమించుకొని, అందులోని సమాధులను ధ్వంసం చేశాడు. దీంతో కాలనీవాసులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. తర్లపాడు పోలీస్‌స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కూడా వినతి పత్రం

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

అందజేశారు. సాయంత్రం బండారు నాగరాజు తన అనుచర వర్గంతో వచ్చి, కాలనీవాసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు జోక్యం చేసుకొని స్మశాన స్థలాన్ని విడగొట్టి.. ఆ స్థలంలో ఈ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. స్వయానా తహశీల్దార్ కిషోర్ కుమార్, ఎంపీడీవో అన్నమ్మ, ఇతర అధికారుల ముందే బండారు నాగరాజు తానే సమాధులను ధ్వంసం చేశానని ఒప్పుకున్నాడు. పొరపాటు జరిగిందంటూ అధికారులు ముందు నేరం అంగీకరించాడు. ప్రభుత్వ ఉద్యోగి అయిన ఉపాధ్యాయుడు నాగరాజుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సాబ్జీకి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయ ఉద్యమానికి ఊపిరైన 'సాబ్జీ'..

యుటిఎఫ్ నేతల నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధ్యాయులు, కార్మిక వర్గాలు, అంగన్వాడీ-ఆశా వర్కర్ల ఉద్యమాలకు అండగా నిలిచిన పూర్వ ఉభయగోదావరి టీచర్ ఎమ్మెల్సీ కామ్రేడ్ సాబ్జి ఉద్యమాలకు ఊపిరి అని పలువురు కొనియాడారు. ఆయన ద్వితీయ వర్ధంతిని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కోశాధికారి ఎన్. చిన్నస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. రవి, జిల్లా ఉపాధ్యక్షులు జి. ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం డివిజన్ స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల మైదానం వేదికగా జరిగిన ఈ పోటీలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల కారణంగా ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖరరెడ్డి, ఎంఇఓ-2 కె.శర్వాణి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఆయా మండలాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -చీరాల

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం చీరాలలో యునైటెడ్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెయింట్ మార్క్స్ లుధరన్ చర్చ్ సభ్యుల సమన్వయంతో, వివిధ క్రైస్తవ సంఘాలు, చర్చిలు ఐక్యంగా పాల్గొనగా, క్రిస్మస్ సందేశాన్ని ఐక్యతతో ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వ విలువలను ప్రజల్లో వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదర సోదరీమణులు, యువత, పాస్టర్లు పాల్గొన్నారు. ఈ ర్యాలీ చాలా ఐటిసి నుండి ప్రారంభమై పట్టణంలోని ప్రధాన కోడలు సాగింది. కాగా ర్యాలీకి ముందు ప్రత్యేక ప్రార్థనలు, క్యాండిల్ సర్వీస్ నిర్వహించి ప్రపంచ శాంతి, సమాజ ఐక్యత కోసం

క్రిస్మస్ వేడుకలలో యువత

ప్రార్థించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నక్షత్రాలు, బెలూన్స్ ఏర్పాటు చేయగా, శాంతా క్లాజ్ చిన్నారులను ఉత్సాహంగా అలరించారు. ర్యాలీ నగర ప్రధాన వీధుల గుండా సాగుతూ బాణాసంచాలు కాల్చడంతో చీరాల పట్టణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో పాస్టర్లు దేవదాసు, నాని బాబు, గిఫ్టీతో పాటు యడం రవిశంకర్, సంగీత, యాతం క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

'మహాసభల' ప్రచారం ముమ్మరం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం. రమేష్‌లు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ పి. కల్పన, టి. మహేష్, జి.రమేష్, కొర్నెపాటి శ్రీనివాసరావు, యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఎస్‌డబ్ల్యూవైఎఫ్ రాష్ట్ర నాయకులు యం. అయ్యపరెడ్డి పాల్గొన్నారు.

- ఒంగోలు రూరల్ మండలం కరవదిలో కూడా సిఐటియు జెండా ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి. కల్పన, మండల కన్వీనర్ ప్రశాంతి మాట్లాడారు.

- ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ మస్టర్ పాయింట్ల వద్ద సిఐటియు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నిపాటి శ్రీనివాసరావు యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.విజయమ్మ, జి.నరసింహం పాల్గొన్నారు.

- సిఐటియు ఒంగోలు నగర సమన్వయ

సిఐటియు జెండాల ఆవిష్కరణ

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కమిటీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా పని ప్రదేశాలు, కార్యాలయాలు, నివాస ప్రాంతాల్లో జెండాల ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమాల్లో నగర కన్వీనర్ టి.మహేష్, సిఐటియు నాయకులు బి.వి.రావు, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, దామ శ్రీనివాసులు, ఎన్.వీరాస్వామి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.డి.హుస్సేన్ తదితరులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- సిఐటియు ఆలిండియా మహాసభలు జయప్రదం చేయాలని ఒంగోలు ఆర్‌టిసి డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో సహాయకార్యదర్శి ఆర్.జగన్ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, యస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప జనరల్ సెక్రటరీ యం. అయ్యపురెడ్డి, యస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.వి. సుజాత, సిఐటియు నగర కో-కన్వీనర్ బి.వి.రావు, పాల్గొన్నారు. పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు జి. శేషయ్య సంఘీభావ సందేశాన్ని అందించారు.

మేయర్ నివాసంలో 'సెమీ క్రిస్మస్'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మేయర్ గంగాడ సుజాత నివాసంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. ఆయనతో పాటు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ హాజరయ్యారు. తొలుత రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేలు కేకును కోసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. యేసు చూపిన ప్రేమ, దయ, కరుణ అందరూ పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మేయర్, ఎమ్మెల్యేలు

ప్రథమ చికిత్స మందులు అందిస్తున్న దృశ్యం

ప్రథమచికిత్స మందులు బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రతి బస్సులో మెడికల్ కిట్స్ ఏర్పాటు చేసేవారు. దురదృష్ట వశాత్తు ప్రమాదాలు జరిగితే మెడికల్ కిట్స్‌లో ఉన్న మందులు ఉపయోగించేవారు. ఒంగోలుకు చెందిన టి సత్యనారాయణ ఆయన కుటుంబ సభ్యులు అద్దంకి డిపోలోని బస్సులు అన్నిటికీ మెడికల్ కిట్స్ సోమవారం అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా దాతలు ముందుకు వచ్చి ఇలాంటి ఉపయోగకరమైన మందుల కిట్స్ అందించడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో ఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అమర్నాథ్

ప్రజాశక్తి - బాపట్ల

ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాపట్ల జిల్లాకు చెందిన గుడివాడ అమరనాథ్, ఆర్థిక కమిటీ సభ్యులుగా వంకా ప్రభాకరరావు ఎన్నికైనట్లు ఎస్టియు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. కడపలో రాష్ట్ర అధ్యక్షులు లంకపల్లి సాయి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జిల్లా నుండి రాష్ట్ర సంఘానికి అమర్నాథ్, ప్రభాకరరావు ఎన్నికయ్యారని తెలిపారు.

సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంపిడిఒ

సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటి ఎంపిడిఒ జిఎస్‌డబ్ల్యూఎస్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని ఆదేశించారు. మండలంలోని చెరుకూరు సచివాలయాలను డిప్యూటీ ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బందికి సర్వేల నిర్వహణపై అవగాహన కల్పించారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరు విషయంలో సమయాపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వేల నిర్వహణలో అలసత్వం వహించవద్దని చెప్పారు. సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వం కొత్తగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై ప్రజల్లో అవగాహన కల్పించి, తప్పులు దొర్లకుండా సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

17న పెన్షనర్స్ డే

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఈ నెల 17న బుధవారం పెన్షనర్స్ డే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు అలపర్తి ఆంజనేయులు సోమవారం తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఉన్న పెన్షనర్స్ హెూం నందు నిర్వహించే కార్యక్రమంలో పలువురు సీనియర్ పెన్షనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు.

కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

ప్రజాశక్తి - నగరం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందు వివిధ కేసుల్లో పట్టుబడిన ఆటో, యమహా ఎఫ్‌జెడ్‌ఎస్ బైకును అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిడెంట్ సమక్షలో స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సిఐ ఎం శ్రీరాంప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల పాటదారులు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మేదరమెట్ల

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

కొరిశపాడు మండలంలోని రావినూతలలో పలు అభివృద్ధి పనులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రారంభించారు. రూ.1.30 కోట్లతో నిర్మించిన సిసి రోడ్లు, కల్వర్టు, సైడ్ కాలువలు, రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి, టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు విగ్రహాలకు పూలమాల వేశారు. గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల వద్ద నుండి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోలార్ సిస్టం గురించి వివరించారు. ఎవరైనా ఇల్లు కట్టుకునే వారుంటే పొజిషన్ పత్రాలు ఇచ్చి సహకరించాలని సచివాలయ సిబ్బందిని కోరారు. మేదరమెట్ల నుండి రాచపూడి వరకు రోడ్డును డబల్ రోడ్డుగా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 150 మంది విద్యార్థులకు సైకళ్ళను పంపిణీ చేశారు. పాఠశాలను జూనియర్ కాలేజీగా మంజూరు చేయించామని, అందుకోసం విద్యార్థుల సంఖ్య పెంచాల్సి ఉంటుందని అన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. బాగా చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంలో మధ్యాహ్నపు భోజనం గురించి వాకబు చేశారు. మంచి బియ్యం అందిస్తున్నామని అన్నారు. పిల్లలకు మంచిగా వండి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు సాదినేని ప్రసన్నకుమారి, ఎఎంసి చైర్మన్ వరగాని పద్మావతి, సర్పంచ్ చాట్ల విజయవేణ, తహశీల్దారు జివి సుబ్బారెడ్డి, ఇంచార్జ్ ఎంపిడిఒలతో పాటు టిడిపి అధ్యక్షులు సింబోతుల సత్యనారాయణ, పమిడిపాడు, రావినూతల, తిమ్మనపాలెం సొసైటీల అధ్యక్షులు, కారుసాల నాగేశ్వరరావు, రామినేని శ్రీనివాసరావు, ఎ ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో చెరుకుపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కాటూరి లక్ష్మీనారాయణ తెలిపారు. కర్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాల్లో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి బాక్స్ లంగడి పోటీల్లో అండర్ 17 విభాగంలో పి లీలా మోహన్ కృష్ణ, ఎం తపస్విని, అండర్ 12 విభాగంలో టి రాహుల్, ఎం యోగవర్షిని ఎంపికై రాష్ట్ర స్థాయిలో ఈనెల 21న నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 14న నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 17 ఖో ఖో పోటీల్లో టి ఉమా హర్షిత, కె వాసంతి ఎంపికై 19న జె పంగులూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యానవన రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బల్లికురవ

మాట్లాడుతున్న శాస్త్రవేత్త కె ఉమామహేశ్వరరావు

బొప్పాయి పంట సాగు చేపట్టిన రైతులు కాయ కోతకు వచ్చిన ప్రస్తుత సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీడి మామిడి ఉద్యాన శాఖ బాపట్ల సీనియర్ శాస్త్రవేత్త కె ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉప్పుమాగులూరులో బొప్పాయి, మిరప పంటల రైతులకు, శిక్షణ నిర్వహించారు. బొప్పాయి పంట ప్రస్తుతం కాయలు ఏర్పడి కోత దశలో ఉన్నందున ఈ దశలో వచ్చే తెగుళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలో సస్య రక్షణ చర్యలు వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్తితుల్లో మిరపలో రైతులకు నల్ల తామర పురుగులు, ముడత (జెమిని వైరస్) లకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల వివరాలు రైతులకు వివరించారు. బొప్పాయి సాగు చేసుకునే రైతులకు ఎంఐడిహెచ్ పథకం కింద ఒక్కో రైతుకు ఒక హెక్టారుకు రూ.18వేల చొప్పున, మల్చింగ్ వేసి సాగు చేస్తున్నట్లయితే అదనంగా ప్లాస్టిక్ మల్చింగ్ పథకం కింద ఒక్కో రైతుకు ఒక హెక్టారుకు రూ.20వేల చొప్పున అందజేస్తారని తెలిపారు. రైతులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. త్వరలో వీరందరికీ సబ్సిడీ నగదు వారి అకౌంట్లలో జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఖలీమ్, మార్టూరు ఉద్యానవన శాఖ అధికారి హనుమంత నాయక్, నీటి సంఘం అధ్యక్షులు సుబ్బారావు పాల్గొన్నారు.

బైటమంజులూరులో స్వామిత్వ ప్రత్యేక గ్రామసభ

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామసభలో మ్యాప్ అందజేస్తున్న అధికారులు

మండలంలోని బైటమంజులూరులో స్వామిత్వ ప్రత్యేక గ్రామ సభ సోమవారం నిర్వహించారు. సభలో డిప్యూటీ ఎంపిడిఒ కె సుమంత్ మాట్లాడుతూ స్వామిత్వ కార్యక్రమం ద్వారా గ్రామ కంఠంలో, విస్తరించిన గ్రామ కంఠంలో, ప్రతి ఒక్కరి స్థలాన్ని కొలిచి, దాని విస్తీర్ణం హద్దులు చూపిస్తూ మ్యాపు రూపొందించి, ఏ ఇంటికా ఇంటి యజమానికి అందజేస్తున్నామని తెలిపారు. విస్తీర్ణం, హద్దుల్లో ఏమైనా తప్పులు ఉంటే తమకు చెప్పాలని కోరారు. సచివాలయం బృందం మళ్లీ ఆ స్థలాలను కొలిచి సరి చేస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చక్రవరం రుక్మిణమ్మ, తిరుమలరాజు, మాజీ సర్పంచ్ చక్రవరం శివరాజు, తోకచిచ్చు అచ్చిరాజు, తిరుమలరాజు, పంచాయతీ సెక్రటరీ వి రాజేష్, విఆర్ఒ శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ కోటిరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గీత, భగవాన్ రాజుపాలెం పంచాయతీ సెక్రటరీ రావుప్ ఖాన్ పాల్గొన్నారు.

పుస్తకాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చరిత్ర వాస్తవాలకు వేదిక గ్రంథాలయం

ప్రజాశక్తి - చీరాల, వేటపాలెం

వాస్తవాలు పదిలం, చరిత్రలకు సజీవ సాక్ష్యం గ్రంథాలయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. వేటపాలెం సారస్వత నికేతనం గ్రంథాలయం సోమవారం సందర్శించారు. 1918లో స్థాపితమైన సారస్వత నికేతనం గ్రంథాలయం తెలుగు, సంస్కృతం, హిందీ భాషల్లోని తాళపత్ర గ్రంథాలు, అరుదైన వ్రాతప్రతులు, పాత పుస్తకాలతో కూడిన అద్భుతమైన సేకరణను పరిశీలించారు. దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన గ్రంథాలయం అన్నారు. పురాతన గ్రంథాలయాల్లో ఒకటిగా పేరొంది చరిత్రకు ఆధారంగా వేటపాలెం గ్రంథాలయం నిలిచిందని అన్నారు. గ్రంథాలయంలో ప్రస్తుతం 90వేలకుపైగా వాల్యూమ్‌లు భద్రపర్చినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ 1929లో గ్రంథాలయాన్ని సందర్శించి శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. ఈ సంస్థకున్న చారిత్రక ప్రాధాన్యత చాటుతోందని అన్నారు. ఆయన వెంట ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, టిడిపి పట్టణ అధ్యక్షులు దోగుపర్తి బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడిఎ బి ఎఫ్రాయం

రసాయన ఎరువులు తగ్గించాలి

ప్రజాశక్తి - అద్దంకి

అధిక రసాయన ఎరువులు వాడకం అనర్థదాయకమని ఎడిఎ బి ఎఫ్రాయిం తెలిపారు. తన కార్యాలయంలో నిర్వహించిన భూమి ఆరోగ్యం, భూసారంపై శిక్షణలో ఆయన మాట్లాడారు. భూమిలో అధిక రసాయన ఎరువులు వాడకం వలన మంచి చేసే సూక్ష్మ జీవులు చనిపోతున్నాయని తెలిపారు. భూమిలో పేరుకు పోయిన భాస్వరంను కరిగించడానికి పాస్ఫో సాల్యూబుల్ బాక్టీరియా బాగా పని చేస్తుందని తెలిపారు. ఒక హెక్టారకు ఒక లీటర్ బాక్టీరియా తీసుకొని పశువుల ఎరువులో కలుపుకొని పొలంలో చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. 30 మంది రైతులకు 50కేజీల చొప్పున జింక్ సల్ఫేట్, పాస్ఫో సాల్యూబుల్ బాక్టీరియా ఒక లీటర్, పొటాష్ సాల్యూబుల్ బాక్టీరియా ఒక లీటర్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ, కొరిశపాడు ఎఒ రామ్మోహనరెడ్డి, రాధారాణి, ఎఎంసి డైరెక్టర్ చింతా వెంకటేశ్వరరెడ్డి, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, ఎఇఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక రోటరీ సామాజిక భవనంలో రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో 8 రోజులుగా నిర్వహించిన యువజన వారోత్సవాలు ఆహ్లాదకరంగా ముగిశాయి. ఈ సందర్భంగా రోటరీ పిడిజి రొటేరియన్ పి శివన్నారాయణ, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు చేతుల మీదుగా విజేతలు, ఆర్గనైజర్స్‌కు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో గీతా ట్రస్ట్ ఛైర్మన్ వలివేటి మురళీకృష్ణ, జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, శివాంజనేయ ప్రసాద్, ముద్దన రఘుకుమార్, భానుకుమారి, సుభాషిణి, గుర్రం రాఘవరావు, ఎంవి రామారావు, ఎస్‌వి స్వామి, జివై ప్రసాద్, ఎం శ్రీనివాసరావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - బాపట్ల

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసిన వాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బి బాబురావు, ఎఓ చక్రధరరావు, డిప్యూటీ ఎంపిడిఒలు జి రామకృష్ణ, పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి, డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డిడి స్మిత్ నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె కృపావతి, జి రవిబాబు, బి శ్రీనివాసులరెడ్డి, కెవిఎస్ రామిరెడ్డి, ఎస్ విష్ణువర్ధన్, కె లావణ్య, బి రాజ్‌కిరణ్ పాల్గొన్నారు.

వేటపాలెం : ఆంధ్ర రాష్ట్ర సాధనలో అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని శాసన సభ్యులు ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చీరాల, వేటపాలెంలోని అమరజీవి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దోగుపర్తి బాలకృష్ణ, కొత్త శ్రీనివాసరావు, దోగుపర్తి సురేష్ కుమార్, నాసిక్ భద్రయ్య, ఆత్మకూరు సురేష్ పాల్గొన్నారు.

భట్టిపోలు : అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వద్ధంతి భట్టిప్రోలు, అద్దేపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక రథం సెంటర్, తహశీల్దారు కార్యాలయ ఆవరణ, టీఎం రావు ఉన్నత పాఠశాల ఆవరణలో విగ్రహాలకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తహశీల్దారు మేక శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దారు అనగాని

వేటపాలెంలో అమరజీవికి నివాళి అర్పిస్తున్న కొండయ్య

శాంతిలక్ష్మి, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఎంఈఓ నీలం దేవరాజు, తునుగుంట్ల సాయిబాబా, మద్దుల నారాయణ, బోలిశెట్టి శ్రీనివాసరావు, బూర్లే రాంప్రసాద్, శెనగపల్లి శ్రీనివాసరావు, చందులూరి రాకోటేశ్వరరావు, చెన్నా ఉమామహేశ్వరరావు, కాలేపల్లి శ్రీనివాసరావు, బూర్లే చంద్రశేఖర్, నాగ రమేష్ పాల్గొన్నారు.

అద్దంకి : రాష్ట్ర అవతరణకు ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములును స్మరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి పాలక మండలి చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పదమేష్, గుంటూరు విజయలక్ష్మి, మాధవరావు, టిడిపి నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు, కూరపాటి కోటేశ్వరరావు, మారుతి, గునుపూడి పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సోమవారం నిర్వహించారు. హెచ్ఎం పేరిరెడ్డి అమరజీవి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కర్లపాలెం : మహనీయులను స్మరిద్దాం, వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. భారతదేశ తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ పోరాట యోధుడు పొట్టి శ్రీరాములు వర్ధంతి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధిలో పటేల్ కృషి గొప్పదని అన్నారు. ప్రత్యేక ఆంధ్రా కొరకు ప్రాణాల అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం ఆంధ్రులకు ఆత్మ గౌరవం అన్నారు. ఎంఇఒ టియు మనోరంజని, డిప్యూటీ ఎంపిడిఒ పద్మావతి, ఎఒ రజిని, సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

పంగులూరు : ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఈతరానికి ఆదర్శమని పలువురు పేర్కొన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పివి సుబ్బారావు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం జీవితాన్ని త్యాగం చేశాడని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ సోము నాగేశ్వరరావు, నున్న వెంకట్రావు, పోలిశెట్టి సాయిబాబు, పోలిశెట్టి రామచంద్రరావు, నున్న శ్రీనివాసులు, కోట జగదీష్, తవ్వ వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు కరణం హనుమంతరావు, షేక్ కాలేశావలి, బాచిన ఆంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేస్తున్న దృశ్యం

సిఎం సహాయనిధి మంజూరు

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని 12వ వార్డుకు చెందిన తోనా వెంకటేశ్వర్లు అనారోగ్య బారిన పడడంతో సంఘమిత్ర హాస్పిటల్‌లో వైద్య సేవల కోసం తరలించారు. అత్యవసరవంగా వైద్యం కోసం ఆర్థిక సహాయం అవసరమని అందించడానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే బాధితులకు వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుండి రూ.2.50లక్షల మంజూరు చేయించారు. అందుకు అవసరమైన ఎల్‌ఓసి పత్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు చేతుల మీదుగా బాధిత కుటుంబ మహిళకు అందించారు.

గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చందలూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పంగులూరు

ఎలగాల సుబ్బారావు స్మారక ప్రతిభా ప్రోత్సాహక బహుమతుల ప్రతిభా పరీక్షలో మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల హెచ్ఎం చందలూరు గిరిజ సోమవారం తెలిపారు. కొరిసపాడు మండలంలోని రావినూతలలో ఎలగాల సుబ్బారావు స్మారక ప్రతిభ ప్రోత్సాహక బహుమతుల ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షలో చందలూరు హైస్కూల్‌కు చెందిన బాచిన మోహన్ శ్రీనివాస్ ఓసీ కేటగిరీలో ప్రథమ స్థానం, కట్టా వంశీకృష్ణ బీసీ కేటగిరీలో ద్వితీయ స్థానం, ఉప్పమాగులూరి వెంకట గీతా చరన్ ద్రితీయ స్థానం సాధించారని తెలిపారు. దీనికి కృషి చేసిన ఉపాధ్యాయులు ఐ వెంకటరమణ, లక్ష్మయ్య, వసుంధరకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. పోటీ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

మాట్లాడుతున్న జె శివకుమార్

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని ధర్మవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని గోపాల్స్ అనే సంస్థ సభ్యులు జై శివకుమార్, పాఠశాల హెచ్ఎం వి శ్రీనివాసులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా కోర్సు ఎంచుకోవటమే గాక అందులో పూర్తి స్థాయి పరిజ్ఞానం పొందడం ద్వారా మంచి భవిష్యత్తు వైపు జీవితాన్ని మలుచుకోవచ్చని అన్నారు. సేంద్రియ ఎరువులు వాడకుండా పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిన గోవాడ గ్రామానికి చెందిన నరిసెట్టి రమేష్ బాబు వ్యవసాయం గురించి, రాబోయే కాలంలో వచ్చే సమస్యల గురించి వివరించారు. అనంతరం ఇరువురిని పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ప్రతిభ కనబరిచిన 10వ తరగతి విద్యార్థులు అశోక్ బాబు, వైష్ణవి, విజయ్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌విఎస్‌హెచ్ ప్రసాద్, చందలూరు నారాయణరావు, బండి నాగేశ్వరరావు, సిహెచ్ కృష్ణారావు, కె ఖాదర్ బాషా, సందిరెడ్డి శ్యామల పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

సీతారామమ్మ (85)

మండలంలోని రణక్కలపాలెంలో ఏలూరి సీతారావమ్మ (85) వృద్ధాప్యరీత్య అనారోగ్యంతో మృతి చెందారు. చనిపోయిన ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు సోమవారం దానం చేశారు. గుంటూరు పెద్దకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కంటి కార్నియా సేకరించారు. భర్త కృష్ణమూర్తి, కుమారులు హరిబాబు, రఘు బాబును రోటరీ అవయవ దాన కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రామ్మోహన్రావు, రోటరీ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి అభినందించారు.

కరి హరిబాబు (69)

ఇంకొల్లుకు చెందిన కరి హరిబాబు (69) కుటుంబ సభ్యుల అంగీకారంతో శంకర్ నేత్రాలయం వైద్యులు కార్నియా సేకరించారు. కుటుంబ సభ్యులు, మృతుని భార్య సుధారాణి, కుమార్తెలు, అల్లుళ్ళు చైతన్య, సౌజన్య, నారాయణ స్వామి, వినోద్ కుమార్‌ను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

కరణం సుబ్బరావమ్మ

చిన్నగంజాం : మండలంలోని చింతగుంపులలో కరణం సుబ్బరావమ్మ (85) వృద్ధాప్యరీత్యా అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె నేత్రాలు కుటుంబ సభ్యులు దానం చేశారు. గుంటూరు పెదకాకానికి చెందిన శంకర్ నేత్ర వైద్యశాల వైద్యులు వచ్చి కంటి కార్నియ సేకరించారు. కుటుంబ సభ్యులు హరికృష్ణ, విజయలక్ష్మి, శ్రీరజినీలను వైద్యులతో పాటు రోటరీ అవయవ దాన కమిటీ నాయకులు రామ్మోహనరావు, వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవలస రాఘవరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు అభినందించారు.

దేవాలయానికి దుప్పట్లు బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం మారుతి భవన్ నందు భక్తుల సౌకర్యార్థం పట్టణానికి చెందిన సందిరెడ్డి కొండలరావు రూ.10 వేల విలువైన దుప్పట్లను చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావుకు శనివారం అందించారు. గోపి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విరమించే వరకూ పోరాటం

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు జిల్లా కేంద్రమైన బాపట్లలో సోమవారం నిరసన ర్యాలి నిర్వహించారు. భారీగా తరలివచ్చిన వైసీపీ నాయకులు పట్టణంలోని డిఎంపల్లి నుండి కోటి సంతకాల సేకరణ పత్రాల ప్రత్యేక వాహనంతో నాయకులు జిబిసి రోడ్డు ద్వారా చీలు రోడ్డు సెంటర్ వరకు ర్యాలీగా తరలించారు. వైద్య కళాశాలల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల పత్రాల రాజధానికి తరలించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెరుగ నాగర్జున మాట్లాడారు. ఈ విధానాన్ని విరమించుకోకపోతే ఉద్యమం చేపడతామన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వైద్య కళాశాలల ఫలాలు పేదలకు అందనీయకుండా వైద్య వ్యాపారం చేసేందుకే పిపిపి పద్ధతి తెచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో రేపల్లె, వేమూరు, అద్దంకి, పర్చూరు,

బాపట్లలో వైసిపి నాయకుల భారీ ర్యాలీ

చీరాల వైసిపి ఇన్‌ఛార్జిలు డాక్టర్ ఈఊరి గణేష్, వరికూటి అశోక్ బాబు, చింతలపూడి అశోక్ కుమార్, గాదే మధుసూదనరెడ్డి, కరణం వెంకటేష్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో సంతకాల ప్రతులను వైసిపి రాష్ట్ర కార్యాలయానికి తరలించే కార్యక్రమం సోమవారం వైసీపీ ఇన్చార్జి డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎఒ శ్రీనివాసరావు సేచించారు. మండలంలోని ముక్తేశ్వరం, అంబడి పూడి గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. దళారులు, మధ్యవర్తుల మాటలు విని మోసపోవద్దని చెప్పారు. తమ ధాన్యాన్ని ఈ కేంద్రాల ద్వారానే విక్రయించు కోవాలని సూచించారు. ఆయా గ్రామాల రైతులతో ప్రత్యేకంగా సమావేశమై ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రాధాన్యతను వివరించారు.

పంగులూరు : మండలంలోని రామకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కొండ మంజులూరు సొసైటీ ఆధ్వర్యంలో జరిగే కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం అమ్ముకోవాలని తహశీల్దారు పి సింగారావు, ఎఒ డి సుబ్బారెడ్డి కోరా రు. ధాన్యం కొనుగోలు పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఉపయోగించుకోవాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు బత్తుల వెంకట్రావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, సిహెచ్ హరిబాబు పాల్గొన్నారు.

యోగాసన పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 29, 30, 31 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి యోగాసన పోటీలకు మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీలు కె ప్రతిమ, కె మధుమూర్తి సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు నాయపాము శృతి, వెంకటేష్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 12 నుండి 14 వరకు జరిగిన యోగాసన స్టేట్ మీట్‌లో నాయ పాము శృతి లెగ్గ బ్యాలెన్స్‌లో ఫస్ట్ ప్లేస్, హ్యాండ్ బ్యాలెన్స్‌లో సెకండ్ ప్లేస్ సాధించిందని చెప్పారు. పాఠశాలకు చెందిన మరో విద్యార్థి ఎం వెంకటేష్ ట్రెడిషనల్‌లో సెకండ్ ప్లేస్ సాధించాడని తెలిపారు.

అర్జీల పరిష్కారంలో ప్రత్యేక దృష్టి: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్"

ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి రాజాబాబు, అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యు అధికారి బి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, కుమార్, జాన్సన్, కళావతి, విజయజ్యోతితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొత్తం 264 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 90 ఫిర్యాదులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జిల్లా ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం)ను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలకు సంబంధించి 90 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ సమస్యలకు సంబంధించిన రాతపూర్వక అర్జీలను జిల్లా ఎస్పీ మరియు పోలీస్ అధికారులకు అందించి, వారి సమస్యలను వివరించారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వివి రమణ కుమార్, ఒంగోలు తాలూకా ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, దర్శి ఇన్‌స్పెక్టర్ వై రామారావు, కంభం సిఐ మల్లికార్జున, కనిగిరి సిఐ శ్రీనివాసులు, పిసిఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ప్యానెల్ అడ్వొకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్దన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యంగా విధులు: ఎస్పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అమరజీవి పొట్టి శ్రీరాములు మొక్కవోని దీక్షను నేటి యువత ఆదర్శంగా తీసుకొని తమ లక్ష్య సాధనకు ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు. పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహానుభావుడని కొనియాడారు. పొట్టి శ్రీరాములు కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక ఉద్యమం, ఒక స్ఫూర్తి అని తెలిపారు. ఆయన జీవితం త్యాగం, నిబద్ధత, నిజాయితీకి ప్రతీకగా నిలిచిందని, తెలుగు ప్రజల హక్కుల సాధనలో

పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి అర్పించిన బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్

ఆయన చూపిన మార్గం నేటికీ తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. అందుకే ఆయనను గర్వంగా "ఆంధ్రుల అమరజీవి"గా స్మరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బీ డీఎస్పీ పి బాల మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ పి విజయసారధి, ఏఓ బి శ్రీనివాసరావు, ఆర్ఐ షేక్ మౌలుద్దీన్, డీపీఓ పాల్గొన్నారు.

విద్యుత్ సమర్థ వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ పొదుపు, సమర్థ వినియోగంపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్) ప్రకాశం సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు నగరంలో ఇంధన పొదుపు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ వద్ద సంయుక్త కలెక్టర్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. విద్యుత్ భవన్ వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు కొనసాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ

సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంతో పాటు భద్రంగా వినియోగించాలన్నారు. దీనిపై ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్లను, బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కె .వెంకటేశ్వర్లు, డిఈఈ మాకినేని హరిబాబు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండాలి

బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సహృదయ భావనతో వారి సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 75 మంది అర్జీదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి, అర్జీలను చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వృద్ధుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సహృదయ భావనతో వారి సమస్యలు పరిష్కరించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. సమాజంలో కొందరు వ్యక్తులు వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మన మొదటి గురువులు తల్లిదండ్రులని, వారు మన కోసం తమ జీవితాన్ని త్యాగం చేశారని ప్రతి ఒక్కరూ గ్రహించాలని జిల్లా ఎస్పీ హితవు పలికారు. వృద్ధాప్యంలో వారిని నిర్లక్ష్యం చేయడం సరికాదని, వారిని ఆదరించి, గౌరవించి, సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా ఎస్పీ తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 75 అర్జీలను స్వీకరించినట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి రామాంజనేయులు, డిసిఆర్బీ డీఎస్పీ పి బాల మురళీకృష్ణ, డిసిఆర్బీ ఇన్‌స్పెక్టర్ కె భుజంగరావు, పీజీఆర్ఎస్ సెల్ డబ్ల్యూఎస్ఐ లక్ష్మీ రాజ్యం, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులలో సేవా దృక్పథం, దేశభక్తి పెంపొందించడమే స్కౌట్ లక్ష్యమని ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి తిరుపతి కిషోర్ కుమార్ తెలిపారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా పరిధిలోని పీఎంశ్రీ పాఠశాలలకు సంబంధించిన స్కౌట్ మాస్టర్లకు శిక్షణ తరగతులు స్థానిక డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఏడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా ఒంగోలు ఎంఈఓ మాట్లాడుతూ. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించవచ్చునని, ఈ సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడ్డారని తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రకాశం జిల్లా అసోసియేషన్ కార్యదర్శి తన్నీరు బాలాజీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎంఈఓ వెంకటారెడ్డి, తాళ్లూరి ఎంఈఓ సుబ్బయ్య, జరుగుమల్లి ఎంఈఓ డోల శ్రీను, అల్లూరి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, శిక్షణ కార్యక్రమానికి ఎల్వోసీగా డివిఎల్ నారాయణ, జిల్లా ట్రెజరర్ పద్రె వెంకట్రావు, రిసోర్స్ పర్సన్స్ కెవి శేషారావు, పి వెంకటరెడ్డి, బ్రహ్మేశ్వరరావు, శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, టి జాన్ వెస్లీ, కే రాము, 51 మంది పిఎంశ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రాలను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

పల్స్ పోలియోను సమర్థంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జాతీయ స్థాయి పల్స్ పోలియో కార్యక్రమం ఈ నెల 21వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో విడుదల చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 21వ తేదీన అన్ని ప్రాంతాలలో పల్స్ పోలియో చుక్కల మందు వేయాలన్నారు. 22, 23వ తేదీలలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కల మందు వేయాలన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా చుక్కలు వేయాలని పలు సూచనలు చేశారు. రోగులకు అన్ని విధాలుగా వైద్య సేవలు పరిపూర్ణంగా అందించిన 17 వైద్యశాలలకు జిల్లా కలెక్టర్ అవార్డులను ప్రదానం చేశారు. సంబంధిత వైద్యాధికారులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు స్ఫూర్తిప్రదాత

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధనకు పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జరిగింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ రోజుగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. స్థానిక పిజిఆర్ఎస్ హాల్‌లో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్డీఓ గ్లోరియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫైళ్ల పరిష్కారంలో.. ఏడో స్థానంలో బాపట్ల కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈ-ఆఫీస్ విధానంలో ఒకరోజు 9 గంటల్లో బాపట్ల జిల్లా నుంచి 1,363 ఫైల్స్ చూడడం, వాటిని పరిష్కరించడం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్ రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారిగా ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ తన వద్దకు వచ్చిన ఫైల్స్ పరిష్కారం విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటానన్నారు. అందువల్లనే ఒకటిన్నర రోజులలోనే ఫైల్స్ పరిష్కారం జరుగుతుందన్నారు. ఈ-ఆఫీస్ విధానాన్ని అధికారులు అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అధికారులంతా కలెక్టర్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలి

రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల తహశీల్దార్ కార్యాలయాలలో నమోదైన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పీజీ ఆర్ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు వీక్షణ సమావేశం ద్వారా హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించు కున్నారు. కొన్నిటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపగా, కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణకు ఆదేశించారు. మొత్తంగా 173 అర్జీలు నమోదు అయ్యాయి. రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు బాగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు తదితరులు పాల్గొన్నారు.